క్లుప్తంగా

కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న కౌన్సిలర్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ శ్రీరాముల సుజాత ఆధ్వర్యంలో అదే వార్డులో పనిచేసే మున్సిపల్ కార్మికులకు శుక్రవారం నూతన దుస్తులు పంపిణీ చేశారు. దసరా పండుగ సందర్భంగా వీటిని అందజేశారు. శ్రీ రాముల మల్లేశ్ యూత్ వార్డు అధ్యక్షుడు కొత్తూరి సంతోష్, బీఆర్ఎస్ నాయకులు నాగరపు రాకేశ్, బుదార్థి విజయ్, అనిల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు



మాట్లాడుతున్న సీఐ కృష్ణ

దండేపల్లి: ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దని లక్సెట్టిపేట సీఐ కృష్ణ అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో గురువారం రాత్రి పోలీస్ కళాజాత కార్యక్రమం నిర్వహించారు. యువత చెడువ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కళాకారులు, తమ పాటల ద్వారా ప్రజలకు వివరించారు. ఎస్సై కుందారపు ప్రసాద్, ఏఎస్సై వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించాలి



ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆదరించి గెలిపించాలని పీసీసీ సభ్యుడు నూకల రమేశ్ కోరారు. పట్టణంలోని కనకదుర్గాకాలనీలో శుక్రవారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. తమ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ కార్డుల వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, లాడెన్, రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నెన్నెల: మండలంలోని జోగాపూర్‌లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న డిగ్రీ విద్యార్థి కామెర ప్రభాస్ కుటుంబాన్ని శుక్రవారం బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు నేతరి స్వామి పరామర్శించారు. మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేసి తల్లి పోసక్కను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. నాయకులు గట్టు బానేష్, మొహిద్‌ఖాన్ ఉన్నారు.

బాపు అప్లికేషన్స్‌తో యువతకు ఉపాధి



బ్రోచర్ విడుదల చేస్తున్న బాపు, తదితరులు

తాండూర్: బాపు అప్లికేషన్స్ ద్వారా యువతకు ఉపాధి లభిస్తోందని మాదారానికి చెందిన సినీ గేయ రచయిత తైదల బాపు తెలిపారు. శుక్రవారం తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో బాపు అప్లికేషన్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో స్మార్ట్‌వాచ్‌లు తయారు చేశామన్నారు. వీటిని యువతతో మార్కెటింగ్ చేయించడం ద్వారా యువత ఉపాధి పొంది ఆర్థికంగా బలోపేతం కావచ్చని సూచించారు. సినీ నిర్మాత దర్శకుడు విజయ్‌వర్మ, సంస్థ సభ్యుడు వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు



మంచిర్యాలలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో..



బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



భీమారం అంగన్‌వాడీ కేంద్రంలో



మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



జన్నారం: ఏఆర్ఎస్ కళాశాలలో..

మంచిర్యాలఅర్బన్/బెల్లంపల్లి/మంచిర్యాలటౌన్/జన్నారం/భీమారం: జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో బతుకమ్మ సంబురాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయినులు రంగు రంగు పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. సంప్రదాయ దుస్తులతో హాజరై సందడి చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమాల్లో విద్యాసంస్థల చైర్మన్లు, ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



సీవీరామన్ డిగ్రీ కళాశాలలో..



మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలి

జన్నారం: గ్రామ పంచాయతీల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలని డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు అన్నారు. మండలంలోని హస్టల్‌తండా పంచాయతీలో ఆయన పర్యటించారు. పారిశుధ్య పనులు, డ్రెయినేజీల నిర్వహణ, పల్లె ప్రకృతి వనం, శ్మశానవాటిక, ఎవెన్యూ ప్లాంటేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీలో రికార్డులు పరిశీలించి సర్పంచ్, కార్యదర్శులతో మాట్లాడారు. పంచాయతీ పరిధిలో పరిసరాల పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. నాటిన ప్రతీ మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ బానవత్ జయశ్రీ, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు

కాంగ్రెస్‌లో చేరికలు

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలోని 35వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ మాజీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ సలీం అనుచరులు 100 మంది, 1వ వార్డు రాజీవ్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కనకయ్య అనుచరులు 150 మంది శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్సీ, ఎన్నికల స్ట్రాటజీ కమిటీ చైర్మన్ ప్రేమ్‌సాగర్‌రావు వారికి పార్టీ కండువాలు కప్పారు. ఆయన మాట్లాడుతూ తాను చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై వారు పార్టీలో చేరారని తెలిపారు.

మంచిర్యాలటౌన్: బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ కె.జగన్‌మోహన్‌రావు పార్టీకి రాజీనామా చేశారు మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. రాబోయే ఎన్నికల్లో ప్రేమ్‌సాగర్‌రావు విజయానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కౌన్సిలర్లు సురేష్ బల్దువా, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, నాయకులు కారుకూరి చంద్రమౌళి, ఖాజా మియా తదితరులు ఉన్నారు.



పాతమంచిర్యాల: పార్టీలో చేరిన నాయకులతో ప్రేమ్‌సాగర్‌రావు

ఓటరు నమోదుకు అవకాశం

లక్సెట్టిపేట: అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగడంతో ఎన్నికల సంఘం అర్హులకు ఓటరు నమోదుకు మరో అవకాశం కల్పించిందని తహసీల్దార్ రాఘవేంద్రరావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఎల్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండినవారు, ఇప్పటికి ఓటరు కార్డు లేనివారు ఉంటే ఈనెల 31 తేదీ వరకు కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారం నింపి బీఎల్వోలకు అందిస్తే పరిశీలించి ఓటరు జాబితాలో చేరుస్తారన్నారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.

పదోన్నతితో బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా కన్నెపల్లి ఎంపీవో కొమ్మెర సతీశ్‌కుమార్ డీఎల్‌పీవోగా పదోన్నతి పొంది మెదక్ జిల్లాకు బదిలీ య్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని డీపీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన్ను పూలమాలలతో సన్మానించారు. మండల పంచాయతీ అధికారి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతిబాపు, డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఎల్‌పీఓలు ఫణీందర్‌రావు, ప్రభాకర్‌రావు, ఎంపీడీఓల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, హాజీపూర్ ఎంపీడీఓ అబ్దుల్‌హై, తెలంగాణ ఎంపీఓ అసోసియేషన్ కార్యదర్శి అజ్మత్‌అలీ, కోశాధికారి సఫ్దర్‌అలీ, సభ్యులు వాసు, అనీల్, శ్రీనివాస్, సత్యనారాయణ, పంచాయతీ సెక్రటరీ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రావణ్, జిల్లా సభ్యులు శ్రీనివాస్, మల్లేశ్, డీపీఎం నరేందర్ పాల్గొన్నారు.



సతీశ్‌ను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు



శిథిలావస్థలో అటవీ చెక్‌పోస్ట్

దండేపల్లి: మండలంలోని గూడెం అటవీ చెక్‌పోస్ట్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షం కురిసిన ఉరవడంతో దాని పైన నల్లకవరు కప్పి కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో చెక్‌పోస్ట్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

తల్లిపాలతోనే ఆరోగ్యం

కాసిపేట: పుట్టిన పిల్లలకు తల్లులు పాలిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ సోమగూడెం పాతబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన, ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ వకుళాదేవి, మహిళలు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ప్రతీనిత్యం ప్రజలతో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కష్టసుఖాలను తెలుసుకోవడమే కాకుండా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు.

రేపు గద్దర్, జహీర్‌ఖాన్‌ల సంస్మరణ సభ

నస్పూర్: భారత్ బచావో, బీసీ ఐక్య వేదిక, సామాజిక న్యాయ వేదిక ఆధ్వర్యంలో నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఆదివారం ప్రజాకవి గద్దర్, లౌకిక ప్రజాస్వామి జహీర్ అలీఖాన్‌ల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. సంస్మరణ సభకు నాయకులు తరలిరావాలని కోరారు. సామాజిక న్యాయ వేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డెపల్లి మనోహర్, భారత్ బచావో జిల్లా చైర్మన్ కనుకుంట్ల మల్లయ్య, నాయకులు సమ్ము రాజయ్య, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో గర్మిళ్ల లయన్స్ క్లబ్, రేకుర్తి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి 40 మందిని శస్త్రచికిత్స నిమిత్తం రేకుర్తి కంటి వైద్యశాలకు పంపించారు. గర్మిళ్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

భీమిని: కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామ శివారులో ముగ్గురు పేకాటరాయుళ్లను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

షీటీమ్ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న షీటీమ్ ఎస్సై హైమ

మంచిర్యాలక్రైం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో షీటీమ్ సేవలు, తల్లిదండ్రుల పాత్ర, మహిళా భద్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీమ్ ఎస్సై హైమ మాట్లాడుతూ మహిళలు, యువతులను ఎవరైన వేధింపులకు గురిచేస్తే షీటీమ్‌ను సంప్రదించాలన్నారు. మహిళల భద్రత కోసం షీటీమ్ పని చేస్తోందన్నారు. ఎవరైన ఈవ్‌టీజింగ్, అసభ్యకరంగా మేసెజ్‌లు చేయడం, వేధింపులకు పాల్పడితే నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి, వైస్ ప్రిన్సిపాల్ కె.శివలీల, డీఏఆర్ కోఆర్డినేటర్ రిజ్వానా, షీటీమ్ ఏఎస్సై ఓబులమ్మ, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ పనులు అడ్డగింత

భీమారం: భీమారం సమీపంలోని సుంకరిపల్లి మీదుగా ఏర్పాటు చేస్తున్న 11 కేవీ విద్యుత్ లైన్ పనులను స్థానికులు శుక్రవారం అడ్డగించి నిరసన తెలిపారు. అధికారుల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమారంలోని ప్రధాన విద్యుత్ లైన్ నుంచి ఆరెపల్లి వద్ద నిర్మించనున్న రైస్‌మిల్లుకి సుంకరిపల్లి ఇళ్ల నుంచి లైన్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దీంతో ఇళ్లలో నివసించే వారికి ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఇళ్ల మీదుగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయమని చెప్పిన అధికారులు మళ్లీ లైన్ పనులు చేపట్టారని తెలిపారు. ఈ పనులు అడ్డుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఏఈ కుమార్‌ను 'సాక్షి'ఫోన్‌లో సంప్రదిస్తే అందుబాటులోకి రాలేదు.



నిరసన తెలుపుతున్న స్థానికులు

లాభాల్లో వాటా ప్రకటించాలి

తాండూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సంస్థ లాభాల్లో వాటాను వెంటనే ప్రకటించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మాదారం టౌన్‌షిప్‌లో శుక్రవారం కాంట్రాక్టు కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కార్మికులను శ్రమదోపిడికి గురిచేస్తూ వారికి తగిన వేతనాలు అందించడం లేదని మండిపడ్డారు. కాంట్రాక్టు కార్మికులకు 2022–23 ఆర్థిక సంవత్సర లాభాల వాటా వెంటనే అందజేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఇఫ్టూ నాయకులు బుచ్చన్న, నాందేవ్, శకుంతల, ఓదెమ్మ, రాజేశ్వరి, చంద్రమ్మ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు వాటా ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జాఫర్ డిమాండ్ చేశారు. ఏరియాలోని సివిల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయం వద్ద శుక్రవారం కార్మికులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఘనంగా గుండా మల్లేశ్ వర్ధంతి



తాండూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



మందమర్రిరూరల్: పూలమాల వేస్తున్న దుర్గరాజ్

తాండూర్: దివంగత మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గుండా మల్లేశ్ 3వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తాండూర్ ఐబీలోని భగత్‌సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లేశ్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మామిడాల రాజేశం మాట్లాడుతూ మల్లేశ్ చేసిన సేవలను కొనియాడారు. నాయకులు కామెర మల్లయ్య, కృష్ణ, దత్తుమూర్తి, నాగరాజు, సత్యనారాయణ, గోపాల్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని ఏఐటీయూసీ ఆఫీస్‌లో గుండా మల్లేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజ్, నాయకులు సుదర్శన్, రాజేశం, వెంకన్న, రసూల్, వీరన్న సంజీవ్ తదితరులు ఉన్నారు.



రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మల్లేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్, కమలమ్మ, రవి, రవీందర్, రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థినుల నృత్యాలు



మందమర్రిరూరల్: నృత్యం చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల స్వాగతోత్సవం (ఫ్రెషర్స్ డే) వేడుకలను స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐఎంఏ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరాలన్నారు. కళాశాలలో చదివి కానిస్టేబుళ్లుగా ఎంపికైన 18 మందిని సన్మానించారు. కేయూ ఫలితాలతో అత్యధిక గ్రేడ్‌లు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు పలువురిని అలరించాయి.

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య, చెన్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగచందర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

వృత్తి శిక్షణ కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రిరూరల్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ కోర్సులు సద్వినియోగం చేసుకోవాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ కోరారు. మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్ ఆవరణలో వృత్తి శిక్షణ కోర్సులను సమితి అధ్యక్షురాలు సవితతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యూటీషియన్, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగ్స్ తయారీలో శిక్షణ ఇస్తామన్నారు. ఏరియా పర్సనల్ మేనేజర్ సట్ల శ్యాంసుందర్, డీవైపీఎం ఆసీఫ్, సేవా సమితి కోఆర్డినేటర్, సభ్యులు ఉన్నారు.



శిక్షణను ప్రారంభిస్తున్న మనోహర్, సవిత